## క్లుప్తంగా

### ప్రజాసమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు

ఏలేశ్వరం: మండలంలో నెలకొన్న వివిధ ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యులు ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ సీహెచ్ రవికుమార్ వర్మను కోరారు. మంగళవారం ఎంపీటీసీని ఆయన కార్యాలయంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి గ్రామాల్లో రహదారులు, డ్రైన్లు, తాగునీటి తదితర సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీ దేవి, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల బాబ్జీ, పసల సూరిబాబు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చిక్కాల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ, సచివాలయ సిబ్బందికి శిక్షణ

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ సిబ్బందికి మంగళవారం పలు అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్టు ఏఓ కె.చంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. మండల లెవెల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఆన్ పీ4 పాలసీపై సమీక్షా సమావేశంలో భాగంగా అవగాహన కల్పించామన్నారు.

### నిధులు రికవరీ చేయాలి



మద్దా వెంకన్న

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం పంచాయతీలో దుర్వినియోగమైన నిధులను తక్షణమే రికవరీ చేయాలని గ్రామానికి చెందిన దళిత నాయకుడు మద్దా వెంకన్న మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 2017వ సంవత్సరంలో పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు నిధులను దుర్వినియోగం చేశారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో దర్యాప్తు చేసి సుమారు రూ. 15,36,905 పంచాయతీ నిధులు దుర్వినియోగం అయినట్టు గుర్తించి సర్పంచ్, కార్యదర్శుల నుంచి రికవరీకి ఆదేశించారన్నారు. పలు మార్లు అధికారులు రికవరీకి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో లోకాయుక్తను ఆశ్రయించగా రికవరీకి తక్షణమే ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినప్పటికీ ఫలితం లేదని, అధికారులు కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేసి పంచాయతీకి జమ చేయాలని డిమాండ్ చేశారు.


### గూగుల్ క్లౌడ్‌తో ఆదిత్య విద్యా సంస్థల ఒప్పందం



గూగుల్ ప్రతినిధులతో కళాశాల చాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గూగుల్ క్లౌడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రో. చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా గూగుల్ క్లౌడ్ సర్టిఫికేషన్లు, అకడమిక్ ప్రోగ్రామ్‌లు, అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యక్రమాల్లో భాగం కానుండగా విద్యార్థులకు ఇండస్ట్రీ-లింక్డ్ ప్రాజెక్టులు ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనా సహకారాలు వంటి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా గూగుల్ క్లౌడ్, రీజినల్ హెడ్ సిద్ధార్థ దల్వాడి, హెనోటిక్ గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈఓ బి.మల్లేశం, డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణా జిల్లాకు రంగా పేరు పెట్టాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు బుజ్జి

తుని: మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని ఆంధ్రా, తెలంగాణ రాధా-రంగా మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సాయంత్రం బాలాజీ లాడ్జ్ సమీపంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఒక జిల్లాకు రంగా పేరు పెడతామని ఇచ్చిన హామీని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సామాజిక వర్గాల నుంచి రంగా అభిమానులు కృష్ణా జిల్లాకు రంగా పేరు పెట్టాలని సీఎం చంద్రబాబును కలిశామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో రాధా-రంగా జిల్లా అధ్యక్షుడు సూరపురెడ్డి శ్రీనివాసరావు, అద్దేపల్లి బాలాజీ, గెడ్డమూరి సురేష్, సీహెచ్ ఈశ్వర్, మొగశాల శ్రీనివాస్, కనిగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిపుత్రులకు మార్గం లేక..

- ఏజెన్సీలో తీరని రహదారుల కష్టాలు
- అటవీ శాఖ అనుమతులే శాపం
- ఏళ్లు గడుస్తున్నా కలగని మోక్షం



ఇటీవల మరమ్మతులు చేపట్టిన ధారపల్లి-కె.మిర్తివాడ రహదారి

ప్రత్తిపాడు రూరల్: పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణి ప్రసవ వేదన, తీవ్ర అనారోగ్యంతో రోగి పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉన్నా డోలీ మోతలే దిక్కు. పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉన్నా గిరిజన గ్రామాల్లోకి అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి. కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లినప్పటికీ మార్గ మధ్యలో ఏం జరుగుతుందో తెలియదు. ఈ విధంగా తరాలు మారుతున్న గిరిశిఖర గ్రామాల్లో నేటికి ఎలాంటి పురోగతి లేదు. దీంతో ఆధునిక సమాజంలోనూ రోడ్లు లేక గిరిపుత్రులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గిరిజన గ్రామాల్లో అభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసినప్పటికీ, నేటి కూటమి ప్రభుత్వం, అధికారుల అలసత్వంతో పరిస్థితి దయనీయంగా మారింది.

**మరమ్మతులకే పరిమితం**

సబ్ ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలో బురదకోట పంచాయి పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అత్యంత అధ్వానంగా ఉన్నాయి. గిరిజన గ్రామాలకు ప్రధాన రహదారి బురదకోట రహదారి ప్రతీసారి మరమ్మతు పనులకే పరిమితమవుతుంది. దీంతో భారీ నిధులు వెచ్చించి చేపట్టిన పనులు ఒక్క వర్షానికే రహదారి పరిస్థితి మరలా యథాస్థితికి వస్తుంది. ఫలితంగా ఈ రహదారిపై ప్రయాణించేందుకు గిరిజన ప్రజలు నరకయాతన పడుతున్నారు. పెద్దిపాలెం నుంచి కిత్తుమూరిపేట వరకూ ఉన్న రహదారిని పదేళ్ల క్రితం పునర్నిర్మించారు. అక్కడ నుంచి దారపల్లి వరకూ ఉన్న రహదారికి ఇటీవల నిర్మాణ పనులు చేపట్టారు. దారపల్లి నుంచి బురదకోట మీదుగా బాపన్నదార, కొండపల్లి వరకూ కొండ ప్రాంతంలో రోడ్డు రాళ్లు లేచి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారిపై ఆదమరిచి ప్రయాణిస్తే ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరగడం సర్వసాధారణంగా మారింది. ఈ రహదారి పైనే గిరిజన ఉత్పత్తులను పెద్దిపాలెం వారపు సంతకు తరలిస్తూ గిరిజనులు జీవనోపాధి పొందుతారు.

**రద్దయిన నిధులు**

ఇప్పటికే రహదారి నిర్మాణానికి మంజూరైన నిధులను ప్రభుత్వం రెండు సార్లు అటవీశాఖ అనుమతులు పేరుతో రద్దు చేసింది. రహదారి నిర్మాణం నిమిత్తం 2007లో ఐటీడీఏ రూ.25 లక్షలు, 2008లో పీఎంఆర్‌జేవై రూ. 1.38 కోట్లు , 2018లో రూ.కోటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రహదారి పనులు శంకుస్థాపనలకు మించి ఒక్క అడుగు ముందుకు సాగడం లేదు.

**గ్రావెల్ రోడ్డుకే పరిమితం**

అటవీశాఖ అనుమతులే రహదారికి శాపమైంది. పెద్దిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కిత్తుమూరిపేట నుంచి బాపన్నదారకు 6 కీ.మీ.ర



తుప్పలతో మూసుకుపోయిన బాపన్నధార- పెదమల్లాపురం రోడ్డు

హదారి నిర్మించాల్సివుంది. ఇందులో రెండు కీ.మీ. మాత్రమే అటవీ ప్రాంతంవుంది. దీంతో అటవీశాఖ అధికారులు కేవలం గ్రావెల్ రోడ్డుకు మాత్రమే అనుమతిస్తున్నారు. సిమెంట్, తారు రోడ్డు వేసేందుకు నిరాకరిచడంతో ఏళ్లు గడుస్తున్నా రహదారి పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కరుణించి రహదారిని నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

**మొర పెట్టుకున్నా ఫలితం లేదు**



బురదకోట గ్రామ పంచాయితీ పరిధిలోని రహదారులు దారుణంగా ఉన్నాయి. ఈ రహదారులపై ప్రయాణించేందుకు ప్రజలు నరకం చూస్తున్నాం. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితంలేదు. రహదారి నిర్మాణానికి శంకుస్థాపన అయితే చేస్తున్నారుకాని నిర్మాణ పనులు చేపట్టడంలేదు. ఇప్పటికైనా కరుణించి పనులు చేపట్టాలి.

– బచ్చల విప్లవ కుమార్, గిరిజన హక్కుల సాధన సంఘం నాయకుడు పాదురుపాక

**రోడ్లు కనిపించడం లేదు**



బురకోట గిరిజన గ్రామ పంచాయితీ పరిధిలోని ధారపల్లి – కె.మిర్తివాడ వరకు ఉన్న రహదారి తాత్కాలిక నిర్మాణ పనులకే పరిమితమవుతుంది. కె.మిర్తివాడ నుంచి బాపన్నదార, పెదమల్లాపురం – బాపన్నధార, బాపన్నధార-కొండ సింగారం మీదుగా ఉలిగోగుల రహదారులు తుప్పలతో పూర్తిగా మూసుకుపోయాయి.

– చింతల రాజు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, బాపన్నదార

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది

ఏలేశ్వరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రత్తిపాడు సీడీపీఓ పద్మావతి అన్నారు. మండలంలోని లింగంపర్తి గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సుపోషిత భారత్ సక్షం భారత్ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పిల్లల సంరక్షణ, ఆరోగ్యంపై పురుషులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యకుమారి, ప్రజాప్రతినిధులు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**సంపూర్ణ ఆరోగ్యాన్ని ఆస్వాదించాలి**

రౌతులపూడి: మండలంలోని ఎస్.అగ్రహారంలో రౌతులపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 130 మంది మహిళలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లోని ప్రతి మహిళ ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తహీనత లేకుండా ప్రతి ఒక్కరు మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని ఆస్వాదించాలన్నారు. అనంతరం బాలికల సంరరక్షణకు తీసుకోవాలసిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సర్నం శ్రీను, పలువురు గ్రామ పెద్దలు, ఆరోగ్య, స్త్రీశిశు సంక్షేమ సిబ్బంది పాల్గొన్నారు.

## మాగుడు తెగులుతో పంటకు నష్టం



రామచంద్రపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కిర్లంపూడి: మాగుడు తెగులుతో వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని దానిని తక్షణం నివారించాలని ఏఓ సుధామాధురి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామచంద్రపురంలో నానో ఎరువు వినియోగంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వరిపొలాలను సందర్శించి పలు చోట్ల మాగుడు తెగులు ఆశిస్తున్నట్టు గుర్తించారు. దీనిపై పెద్దాపురం ఏడీఏ దైవకుమార్ మాట్లాడుతూ మాగుడు తెగులు నివారణకు ఎకరాకు 400 మీల్లి లీటర్లు హెక్సాకోనజోల్ లేదా వాలిడామైసిన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఈఓ సురేష్, వీఏఏ వెంకటలక్ష్మి ఉన్నారు.

కోటనందూరు: ప్రతికూల వాతావరణంలో వరికి ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ జగ్గప్పారావు అన్నారు. అల్లిపూడి, కోటనందూరు గ్రామాల్లో మంగళవారం పొలం పొలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈఓ మాట్లాడుతూ దోమ, పురుగులను అరికట్టేందుకు క్రిమిసంహారిక మందుల కంటే పసుపురంగు జిగురు అట్టలు వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. రాయితీపై అందించే పసుపురంగు జిగురు అట్టలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం వరిపొలాలను పరిశీలించి రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు.

## కోతలు పారదర్శకంగా చేపట్టాలి

శంఖవరం: పంట కోత ప్రయోగాలు పారదర్శకంగా చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సిబ్బందికి సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి, వీఆర్‌ఓలకు పంటకోత ప్రయోగాలపై మంగళవారం శిక్షణను ఇచ్చారు. ఏఓ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల్లో పొలం ఎంపిక, పంట రకం, రైతు వివరాలు, పంట వేసిన తేది, పంటకోత కోసిన తేది, దిగుబడి, గడ్డి దిగుబడి వంటి అంశాలపై నమోదు చేసేటప్పుడు సిబ్బంది జాగ్రత్తలు వహించాలని సూచించారు. పంట బీమా పథకం గూర్చి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనువాస్, సిబ్బంది క్రాంతి, చిన్నారి, మణికంఠ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒమ్మంగి సొసైటీకి రూ.25 వేల జరిమానా

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ)కి జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి రూ.25 వేలు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మంగళవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి జోకా అమృత తెలిపారు. గత నెల 30న వ్యవసాయశాఖ కమిషనర్ దగ్గర నుంచి టాప్ 20 బైయర్స్ రిపోర్టులో ఒమ్మంగి సొసైటీలో ఆగష్టు నెల విక్రయాల్లో నలుగురు వ్యక్తులు యూరియాను అధికంగా కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టాలని ఉన్నత అధికారుల నుంచి స్థానిక ఏడీ శ్రీనివాసరావు, ఏఓ జోకా అమృతలకు ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు సొసైటీలో విచారణ చేపట్టి నలుగురు వ్యక్తుల పేరున 170 బస్తాల యూరియాను విక్రయించినట్లు గుర్తించారు. ఆగస్టు నెలలో ఒక్కో రైతుకు అవసరం మేరకు రెండు బస్తాల నుంచి ఐదు బస్తాల మాత్రమే యూరియాను పంపిణీ చేశారు. పాస్ బుక్‌లో ఎక్కువ భూమి ఉంటే దాని మేరకు అదనంగా ఎరువులను అందజేశారు. అయితే దీని పూర్తి భిన్నంగా ఒక వ్యక్తికి 50 బస్తాలు, మరో ముగ్గురు వ్యక్తులకు 40 బస్తాల చొప్పున 170 బస్తాల యూరియాను పంపిణీ చేసినట్లు అధికారుల విచారణలో తేలడంతో కలెక్టర్ ఈ జరిమానా విధించారు.



ఒమ్మంగి సొసైటీ

# గాయత్రీమాతా నమోస్తుతే..



రౌతులపూడిలో పూజలు నిర్వహిస్తున్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు: విజయదశమిని పురస్కరించుకుని మండలంలోని దుర్గామాత ఆలయాల్లో మంగళవారం భవానీ భక్తులతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. ప్రత్తిపాడులోని గ్రామ పంచాయతీ వద్ద, మునసబు గారి రామాలయం, కొండవార మలుపు వద్ద, బైపాస్ రోడ్డులోని అటవీశాఖ చెక్‌పోస్టు, ప్రతిష్ఠించిన దుర్గ మాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షణలో రుత్విక్కులు విఘ్నేశ్వర పూజతో అర్చనలకు శ్రీకారం చుట్టారు. పంచగవ్య ప్రాసన, పార్థివేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో భారీ ఎత్తున భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

ఏలేశ్వరం: శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు మంగళవారం దుర్గాదేవి అమ్మవారిని నిర్వాహకులు గాయత్రిదేవిగా అలంకరించారు. ఏలేశ్వరం పట్టణంలోని లింగవరంకాలనీ, తోటవీధి, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయం, సువ్వయ్యమ్మపేట, నర్సీపట్నం రోడ్ ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం ఆలయాల వద్ద కుంకుమపూజలు నిర్వహిస్తున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో 2వ రోజు మంగళవారం దుర్గాదేవి అమ్మవారు గాయత్రీదేవి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాచపల్లి అరుణాచల క్షేత్రంలో అపితకుచాంబా, ధర్మవరం సూర్యారావుపేటలో కనకదుర్గమ్మ, ఒమ్మంగి విజయదుర్గ గాయత్రిదేవి అమ్మవారిగా అలంకరించారు. మండలంలోని పెద్దిపాలెం, ఉత్తరకంచి, రాచపల్లి, శరభవరం, గజ్జనపూడి, పోతులూరు, తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో అర్చకులు, అమ్మవారికి అలంకార పూజలు, కుంకుమ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

**కనకదుర్గ అమ్మవారికి ముద్రగడ పూజలు**

రౌతులపూడి: దేవీ నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మంగళవారం పార్టీ శ్రేణులతో కలసి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయనకు మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్పులతో ఆలయ మర్యాదలతో కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికారు. నియోజకవర్గంలో ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగజేయాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏటా అత్యంత వైభవంగా అమ్మవారి నవరాత్ర మహోత్సవాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు, పార్టీ మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యన్నారాయణ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి రాయి ప్రసాద్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కాకి నాని, బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంకటరమణ, పార్టీ నాయకులు పోలుపర్తి తాతాజీ, కేదారిశెట్టి నాగేశ్వరరావు, పారేపల్లి శ్రీరామకృష్ణ, యెనుమల కోటిబాబు, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన నిర్వహిస్తున్న శరన్నవరాత్రి వేడుకల రెండోరోజు ఆశ్వయుజ శుద్ధ విధియ మంగళ వారం రత్నగిరి దుర్గామాతలైన కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లను సర్వ శుభాలను అనుగ్రహించే కల్యాణ గౌరి మాతగా అలంకరించి పూజలు చేశారు. దసరా వేడుకల రెండో రోజు మంగళవారం అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కనకదుర్గ, వనదుర్గ అమ్మవార్లకు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దర్బారు మండపంలో ఉదయం రుత్విక్కులు శ్రీ సూక్త, పురుషసూక్త, మన్యుసూక్త పారాయణలు, లలితా, విష్ణు సహస్ర నామావళి పారాయణ చేశారు. యంత్రాలయంలోని శ్రీమహా వైకుంఠ నారాయణ విభూతి యంత్రానికి రుత్విక్కులు పూజలు చేశారు. వేదపండితులు, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రతపురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

**బ్రహ్మచారిణీ అవతారంలో..**

తొండంగి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గోపాలపట్నం గ్రామదేవత నేరేళ్లమ్మ బ్రహ్మచారిణీ అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, సప్తనదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన యర్రమిల్లి సూర్యప్రకాష్, సుందరలక్ష్మి పార్వతి దంపతులు సహకారంతో అమ్మవారిని అంలకరించామని ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ తెలిపారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గండేపల్లి: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తాళ్లూరులో స్వయంభూగా వెలసిన రామలింగేశ్వర స్వామి వారికి ఆశ్వీయుజమాస విదియ మంగళవారం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విఎస్ఎన్ మూర్తి బాలాత్రిపుర సందరి అమ్మవారికి, చండీనవార్ణ, నవార్ణ, నవార్ణ దుర్గాదేవికి ప్రత్యేక కుంకుమార్చనలు చేపట్టారు. పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కిర్లంపూడి: మండలంలోని శరన్నవరాత్ర మహోత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ, జగపతినగరంలోని అభయ దుర్గమ్మ, కుమ్మరివీధి, చిల్లంగి, సింహాద్రిపురం, తామరాడ, వీరవరం, రామచంద్రపురం గ్రామాల్లో వేంచేసి ఉన్న దుర్గాదేవి అమ్మవారు రెండో రోజు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

తుని: స్థానిక పాతబజారు వీధిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్ర బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లకు దేవస్థానం చైర్మన్ బాలాజీ, ధర్మకర్తలు, టీడీపీ నాయకులు రాజేష్, ఇనుగంటి సత్యన్నారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. పలువురు పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గోకవరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలోని వీరభద్రుడి గద్దెలో కొలువైయున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవీచౌక్ ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, వల్లూరి శ్రీనివాస్‌శర్మలు అలంకార పూజలు, హోమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తుని రూరల్: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే లోవ తలుపులమ్మ అమ్మవారికి గాయత్రీదేవి అలంకరణలో భక్తుల దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారికి వేదపండితులు, ప్రధాన అర్చకులు గాయత్రీదేవిగా అలంకరించారు. చండీ హోమం, భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భవానీ భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్టు ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు.



రాచపల్లిలో గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



గాయత్రి అమ్మవారిని పూజిస్తున్న మహిళలు



గోకవరం విజయదుర్గా పీఠంలో అమ్మవారికి అర్చనలు నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణ గౌరిగా దర్శనమిచ్చిన రత్నగిరి వనదుర్గ అమ్మవారు



తుని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళల సామూహిక కుంకుమార్చనలు

### గిరిబాబును కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసి సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమిల్‌తో పాటు పలువురు నాయకులు మంగళవారం కలిశారు. నియోజకవర్గంలోని పార్టీ విస్తీర్ణంపై చర్చించారు. నియోజకవర్గంలోని వివిధ విభాగాల నాయకులు క్షేత్రస్థాయి కార్యకర్తలతో మమేకమై పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని ఇన్‌చార్జి సూచించారు . జిల్లా ఉపాధ్యక్షులు బెహరా దొరబాబు, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, వైస్ ఎంపీపీ సాయి, కన్వీనర్లు శిడగం వెంకటేశ్వరరావు, రామిశెట్టి నాని, నరాల శ్రీను, గొల్లపల్లి సురేష తదితరులు ఉన్నారు.

### ఆయుర్వేద వైద్యాన్ని ఆచరించాలి



ఆయుర్వేదంపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు కేదార్ శర్మ

గోకవరం: ఆయుర్వేదం ప్రాచీన కాలం నుంచి వస్తున్న వైద్యమని ప్రతీ ఒక్కరూ ఈ వైద్యాన్ని ఆచరించాలని ఆయుర్వేద వైద్యాధికారి జి.కేదార్‌శర్మ అన్నారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయుర్వేద వైద్యంపై ఉచిత ఆయుర్వేద క్యాంపు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో ఉన్న ఆయుర్వేద వైద్య సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, ఏ.అరుణ, పి.అరుణ్‌కుమార్, హెడ్ నర్స్ విమలకుమారి, ఎంపీహెచ్ఏలు పవన్, రమణ, ప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు